

మావోయిస్టుల లొంగుబాటు

మావోయిస్టు ఏరియా కమిటీ గ్రామ కమిటీ ఇన్‌చార్జ్‌లు లొంగిపోయినట్లు సోమవారం ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. 8లో



కేరళ సహకార రంగంపై..

ఈ నెల 19 నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం కేరళ సహకార రంగంపై అధ్యయనం చేస్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 27°

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక సోమవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు దగ్గర పడుతుండటంతో అధిక సంఖ్యలో భక్తులకు తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించే గోదావరి తీరంలో సందడి నెలకొంది.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీసీతారామచంద్ర స్వామివా రి దేవస్థానంలో చిత్త నక్షత్రం సందర్భంగా సోమవారం సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమశాలలో అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

23న ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

మణుగూరురూరల్/భద్రాచలంటౌన్: గిరిజన గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 23న భద్రాచలం కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు భద్రాచలం, మణుగూరు కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.దేవదాసు, పద్మావతి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. టీసీ, స్టడీ, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, నాలుగు జిరాక్స్ సెట్లు, ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. 2023–24లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

ఆర్చరీ శిక్షణా కేంద్రానికి రికర్వ్ బో..



రికర్వ్ బోను అందజేస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాల్వంచ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఉచిత ఆర్చరీ శిక్షణా కేంద్రానికి రూ 3.50 లక్షల విలువైన రికర్వ్ బోను జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల చేతుల మీదుగా ఆర్చరీ కోచ్ టి.కల్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణా పరికరాలను ఉపయోగించుకుని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలన్నారు. కాగా శిక్షణా కేంద్రంలో 38మంది క్రీడాకారులు ఆర్చరీ శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎ.పరంధామ రెడ్డి, ఆర్.ఉదయ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఏఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్) ద్వారా 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యాసంవత్సరానికి మూడో తరగతిలో 61 సీట్లు, ఐదో తరగతిలో 30 సీట్లు, ఎనిమిదో తరగతిలో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దమ్మపేట, భద్రాచలం, ఇల్లెందు సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాల నుంచి దరఖాస్తు ఫారాలు పొందవచ్చని తెలిపారు. కులం, నివాసంతోపాటు తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జతపరిచి జూన్ 6 వరకు ఐటీడీఏ భద్రాచలం కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జూన్ 12న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పట్టభద్రులు మోసపోవొద్దు



కొత్తగూడెంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని పరిచయం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై ఎంపీ రవిచంద్ర, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు

- ఈసారి కూడా మోసపోతే ఆ తప్పు మనదే అవుతుంది..
- ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలి
- శాసనమండలి అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలి
- కొత్తగూడెం, ఇల్లెందు సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: శాసనమండలి నల్లగొండ–వరంగల్–ఖమ్మం నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని, పట్టభద్రులు మోసపోవొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో, ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. ఆరు నెలల క్రితం అరచేతిలో వైకుంఠం చూపిస్తే నమ్మవద్దని, నమ్మితే ఘోస పడతారని చెప్పినా వినకుండా ప్రజలు మోసపోయి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారని అన్నారు. మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మోసపోకుండా ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మొదటిసారి మోసపోతే కాంగ్రెస్ మాయ అనుకుందామని, అదే రెండోసారి మోసపోతే మన తప్పే అవుతుందని అన్నారు. ఆరు నెలల క్రితం కొలువైన కాంగ్రెస్‌తోపాటు సీపీఐ ఇచ్చిన హామీలను ఎంతమేరకు పరిష్కరించారో అర్థం చేసుకోవాలన్నారు. రైతుల సమస్యలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వేసే నాడు రైతుబంధు రైతుల ఖాతాల్లో వేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓట్లు వేసే నాడు వేస్తోందని విమర్శించారు. డిసెంబర్ 9న రైతుబంధు ఖాతాల్లో వేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందన్నారు. తాము అధికారం, పాలనను వికేంద్రీకరణ చేసి ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందించామన్నారు. బలమైన ప్రతిపక్షం లేకపోతే సింగరేణిని బీజేపీ, కాంగ్రెస్‌లు అదానీకి అమ్మేస్తారని ఆరోపించారు.

అభ్యర్థుల చరిత్ర చూడాలి..

బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులు అభ్యర్థుల చరిత్ర కూడా చూడాలన్నారు. తెలంగాణ ఆర్థిక ముఖ చిత్రం ఎలా ఉండాలనే పుస్తకం రాసిన రాకేష్‌రెడ్డి ఒక వైపు ఉంటే, చీటర్, 56 కేసులున్న మల్లన్న మరోవైపు ఉన్నాడని తెలిపారు. మాజీ మంత్రి సత్యవతి మాట్లాడుతూ 5 నెలల క్రితం కాంగ్రెస్ ప్రజలను మాయమాటలతో మోసం చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలతో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ దామోదర్, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్, రంగనాథ్, దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చాం..

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండులక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, దేశంలో ఎక్కడైనా ఇలా ఇచ్చిఉంటే తాను రాజీనామా చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పూర్తయిన 30 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ఊదరగొట్టే వాగ్దానాలతో గెలిచిందని, అయితే ఈ ఐదారు నెలల్లో అందరికీ అర్థం అయ్యిందన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కళాశాలలు ఉండగా, తమ ప్రభుత్వ హయాంలో 33 మెడికల్ కళాశాలలకు పెంచామని గుర్తుచేశారు. మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మంలో మెడికల్ కాలేజ్‌లు, నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేసి, ఉన్నత చదవులు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. కొత్తగూడెంలో 140 మంది సూపర్‌స్పెషాలిటీ వైద్యులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇల్లెందు పట్టణ అభివృద్ధి ఘనత తమదేనన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అడిగే దమ్ము కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఉందా అని ప్రశ్నించారు. పట్టభద్రులు మోసపోకుండా రైతు బిడ్డ, ఉన్నత విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పాల్వంచలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇక్కడి పట్టభద్రులు తనను ఆదరించి చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని కోరారు.

పదవికి వన్నె తెచ్చేందుకే పోటీ



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, వేదికపై ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు



హాజరైన ప్రజలు, పట్టభద్రులు

- ఏనాడూ పట్టభద్రుల కోసం పనిచేయని పల్లా
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

ఇల్లెందు: ఎమ్మెల్సీ పదవిపై తనకు ఆశ లేదని, ప్రజలిచ్చిన తీన్మార్ మల్లన్న అనే పదవి కంటే ఇది పెద్దది కాదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పదవికి వన్నె తెచ్చేందుకే పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి జేకే కాలనీలోని ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. గతంలో పోటీ చేసినప్పుడు తనతోడు పట్టభద్రులే ఉన్నారని, ప్రస్తుతం పట్టభద్రులతోపాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, టీడీపీ కూడా జత కలిశాయన్నారు. ఇంతమంది కలిశాక బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అమెరికా నుంచి కాదు అంతరిక్షం నుంచి దిగి వచ్చినా గెలువడన్నారు. గతంలో గెలిచిన పల్లా రాజేశ్వరరెడ్డి ఏనాడూ ఈ ప్రాంతంలో కనిపించలేదని, పట్టభద్రుల కోసం పనిచేయలేదని విమర్శించారు. ఓడిన తీన్మార్ మల్లన్న మాత్రం మరుసటి రోజు నుంచే ప్రజల మధ్య ఉన్నాడని గుర్తుచేశారు. అమెరికా నుంచి ఓ గొప్ప మేధావి వచ్చినట్లు ఇల్లెందు సభలో కేటీఆర్ ప్రకటించాడని, తనకు అమెరికాలో చదివే స్థోమత లేకపోవచ్చని, వరంగల్ జిల్లాకు చెందిన పేద విద్యార్థిని అరుంధతిని అమెరికా చదువుకు పంపించిన చరిత్ర మాత్రం ఉందన్నారు. పేదల గుడిసె నుంచి వచ్చిన తాను అదే పేదల గుడిసెల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. ఎంతోమంది పేదలకు ఉచిత వైద్యం, ఆపరేషన్లు చేయించానని అన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ అంటూ బీజేపీ ఒకవైపు, తెలంగాణలో పరీక్షల లీకేజీలు, ఉద్యోగాలు అమ్ముకోవటం లాంటి చరిత్ర ఉన్న బీఆర్ఎస్ మరొక వైపు ఉన్నాయని, వీరికి పోటీగా ప్రజల గొంతుక మల్లన్న ఉన్నాడని పేర్కొన్నారు. ధరణి, కాళేశ్వరం బాగోతం, అవుటర్ రింగురోడ్డు, హైదరాబాద్ భూములు అమ్మకం లాంటి అనేక కుంభకోణాలను తాను వెలికి తీశానని తెలిపారు. ఈ తరుణంలోనే తన మీద 70 కేసులు పెట్టారని, ఇందులో ఒక్కటీ తన ఇంటి పంచాయితీకి సంబంధించినది కాదని పేర్కొన్నారు. అవాకులు చెవాకులు పేలుతున్న బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి కేటీఆర్.. కవిత మీద ఎందుకు కేసు నమోదైందో చెప్పాలన్నారు. తన భార్యా పిల్లలను కేసీఆర్ ఏడ్పించారని, ఆయన కూతురు మార్చి 26 నుంచి జైలులో ఏడుస్తోందని అన్నారు. పట్టభద్రులు అంతరాత్మ సాక్షిగా ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇన్‌చార్జ్ మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, నాగ సీతారాములు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, ఎంపీపీ నాగరత్నమ్మ, గార్ల జడ్పీటీసీ ఝాన్సీ, మెట్టెల కృష్ణ, పులి సైదులు, డానియేల్, సీపీఐ, సీపీఎం, టీడీపీ నేతలు శంకర్, నజీర్ అహ్మద్, నబీ, ముద్రగడ వంశీ, ఎంపీ నాగిరెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వానికి భిన్నంగా పాలన



గువ్వలగూడెంలో పొంగులేటిపై పూలు చల్లుతున్న నాయకులు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి : గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా తమ పాలన సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగారం, సదాశివాపురం, పాత కొత్తూరు, నాచేపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. సమస్యలపై వినతులు స్వీకరించడంతో పాటు రైతులు, యువత, మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగా పైరవీలకు తావు లేకుండా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కక్షపూరితంగా పనులు కూడా ఆపేశారని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇళ్లు, పింఛన్‌లు, ఇంటి స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పాలేరు నియోజకవర్గాన్ని తన సొంత గ్రామంగా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు. నీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో రాజీపడకుండా ముందుకు సాగుతామన్నారు. మొదటి దశలో నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని, వచ్చే మూడేళ్లలో అందరికీ పక్కా ఇళ్లు ఉండాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఎన్నికల కోడ్ ముగిశాక అర్హులను ఎంపిక చేస్తామని అన్నారు. విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల్లో ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, నల్లాని మల్లికార్జున్ రావు, కె.హనుమంతరావు, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, భద్రయ్య, వెంకన్న, కడియాల నరేష్, మోహన్‌రెడ్డి, కొమ్మినేని విజయ్‌బాబు, రాయపూడి నవీన్ పాల్గొన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనమండలి నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికను పాదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఎన్నికల సిబ్బందికి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుందని, అధికారులు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. 26న శ్రీరామచంద్ర ఆర్ట్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, 27న రిసెప్షన్ కూడా అక్కడే ఉంటుందని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆర్డర్ ఆఫ్ ప్రియారిటీ ప్రకారం నంబరు ద్వారా ఓటు వేయాలని, పోలింగ్ స్టేషన్లలో ఇచ్చిన వైలెట్ కలర్ స్కెచ్‌పెన్ మాత్రమే వాడాలని, ఇంకా ఏవిధమైన నంబర్లు, పేరు, సిగ్నేచర్ రాయవద్దని సూచించారు. బ్యాలెట్ పేపర్‌ను ముందు నిలువుగా, తర్వాత అడ్డంగా మలిచి బ్యాలెట్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫామ్–12 ద్వారా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, ఎన్నికల సూపరింటెండెంట్ ధారా ప్రసాద్, ట్రైనింగ్ నోడల్ అధికారి అలీం, డీఎల్ఎంటీ పూసపాటి సాయికృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు వచ్చేస్తున్నాయి..

- జిల్లాకు చేరిన 3,15,050 పాఠ్యపుస్తకాలు
- వారంలోగా మండల కేంద్రాలకు చేరవేత
- పాఠశాలల ప్రారంభంరోజే విద్యార్థులకు పంపిణీ



గోదాంలో భద్రపరిచిన పుస్తకాలు

కొత్తగూడెంఅర్బన్: విద్యా సంవత్సరంలో పాఠశాలల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు అందించేలా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే పాఠ్యపుస్తకాలను జిల్లాకు చేరవేస్తోంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు 61 శాతం చేరగా, మిగిలిన 39 శాతం పుస్తకాలు పాఠశాలల ప్రారంభం నాటికి వస్తాయని జిల్లా విద్యాధికారులు చెబుతున్నారు. నోటు పుస్తకాలు వందశాతం జిల్లాకు చేరాయి. గోదాంకు చేరిన పుస్తకాలను ఈ నెలాఖరులోగా మండల కేంద్రాలకు పంపించనున్నారు. జూన్ 1వ తేదీ నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు చేరవేయనున్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటికే మైనర్ మరమ్మతులు పూర్తి చేసి కొన్ని సదుపాయాలు కల్పించారు. దీంతోపాటు మన ఊరు–మన బడి కార్యక్రమం పనులు కూడా ఇంకా కొన్ని పాఠశాలల్లో జరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ఈ ఏడాది అడ్మిషన్లు సైతం పెరిగే అవకాశాలున్నాయని విద్యాధికారులు చెబుతున్నారు. గత ఏడాది కూడా అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. బడిబయట పిల్లలపై సర్వే, జూన్ నెలలో బాడిబాట వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశాలున్నాయి.

నోట్ పుస్తకాలు వందశాతం..

జిల్లాలోని 1,299 ప్రభుత్వ పాఠశాలల్లో 63,399 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి 5,17,000 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 3,15,050 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఇంకా 2,10,950 పాఠ్య పుస్తకాలు ఇంకా రావాల్సి ఉంది. దీంతోపాటు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ప్లేన్ నోట్ పుస్తకాలు 2,12,868, రూల్స్ నోట్ పుస్తకాలు 51,590.. మొత్తం 2,66,458 నోట్ పుస్తకాలు వందశాతం వచ్చాయని జిల్లా విద్యాధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది కూడా పార్టు–1, పార్టు–2గా పాఠ్యపుస్తకాలు జిల్లాకు రెండు దఫాలుగా వస్తాయి. విద్యార్థుల బ్యాగుల బరువు తగ్గించేందుకు పార్టు–1, పార్టు–2గా విభజన చేసి పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పార్టు–2 సంబంధించి అక్టోబర్ నెలలో 1,43,200 పుస్తకాలు రానున్నాయి.

రావాల్సిన పుస్తకాల వివరాలు

తరగతి	సబ్జెక్టు
1	తెలుగు
2	ఇంగ్లిష్,
3	ఇంగ్లిష్, మ్యాథ్స్
4	ఇంగ్లిష్
6	తెలుగు, ఇంగ్లిష్, సైన్స్
7	సైన్స్, హిందీ
8	తెలుగు, ఇంగ్లిష్
9	హిందీ, బయాలజీ, భౌతికశాస్త్రం, ఇంగ్లిష్, గణితం
10	హిందీ, సోషల్, భౌతికశాస్త్రం

61 శాతం వచ్చాయి..



జిల్లాకు ప్రస్తుతం 61 శాతం పాఠ్య పుస్తకాలు, వంద శాతం నోట్ పుస్తకాలు వచ్చాయి. ఇంకా మిగిలిన 39 శాతం పాఠ్య పుస్తకాలు పాఠశాలల ప్రారంభం నాటికి జిల్లాకు చేరతాయి. వచ్చిన పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ జూన్ మొదటి వారం కల్లా పూర్తి చేస్తాం.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

ఇకపై టీజీ డిస్కం

- టీఎస్ఎన్పీడీసీఎల్ టీజీఎన్పీడీసీఎల్‌గా మార్పు

ఖమ్మంవ్యవసాయం : విద్యుత్ పంపిణీ సంస్థ పేరులో మార్పు చేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ (టీఎస్ ఎన్పీడీసీఎల్) సంస్థగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నామకరణ చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పేరులో స్వల్ప మార్పు చేస్తూ తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ (టీజీ ఎన్పీడీసీఎల్) సంస్థగా నిర్ణయించింది. దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థకు కూడా టీజీ ఎస్పీడీసీఎల్‌గా నామకరణం చేశారు. సంస్థ నిర్వహణలో ఉన్న కార్యాలయాల బోర్డులను టీజీ ఎన్పీడీసీఎల్ పేరుతో ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఎస్ఈ సర్కిల్ కార్యాలయం మొదలు డీఈ, ఏడీఈ, ఏఏఓస్, ఏఈ ఆపరేషన్స్ కార్యాలయాలు టీజీ ఎన్పీడీసీఎల్ కార్యాలయాలుగా మారనున్నాయి.

జాతీయ స్థాయిలో బంగారు పతకం

పరుగు పందెంలో రాణించిన సింహాద్రి

చింతకాని : ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగు పందెంలో చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు సింహాద్రి బంగారు పతకం సాధించాడు. వరంగల్‌లోని అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ శిక్షణ పొందుతున్న సింహాద్రి.. ఈనెల 18 నుంచి ఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీలకు హాజరయ్యాడు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువకులతో పోటీపడి 1600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుని జూన్ 20 నుంచి నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు వీరబాబు, దేవమణి దంపతుల కుమారుడు సింహాద్రి పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు. ప్రస్తుతం వరంగల్‌లోని అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ శిక్షణ పొందుతున్నాడు. జాతీయ స్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన సింహాద్రిని గ్రామస్తులు అభినందించారు.



సాధించిన పతకాలతో సింహాద్రి

క్లుప్తంగా

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పాఠశాలలో జరుగుతున్న పనులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచరూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. మండలంలోని కోడిపుంజులవాగు, పునుకుల, కిన్నెరసాని గ్రామ పంచాయతీల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులు, నర్సరీలను పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలని చెప్పారు. నర్సరీలో గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఏపీఓ పారండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, సీసీలు సైదులు, శ్రీను, పంచాయతీ కార్యదర్శులు బాబూరావు, పాషా, అనిల్, క్షేత్ర సహాయకులు రమేశ్, సామ్రాజ్యం పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

దమ్మపేట: బైక్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టగా అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మండలంలోని గట్టుగూడెం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గట్టుగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల సత్యనారాయణ (48) సోమవారం తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం బయటకు వెళ్లి, తిరిగి గట్టుగూడెం గ్రామ శివారులో రోడ్డు పక్కనే ఉన్న ఇంటికి వస్తున్నాడు. అతడు రోడ్డును దాటి ఇంటికి వచ్చే క్రమంలో అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అశ్వారావుపేటకు తరలించి, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు


చికిత్స పొందుతున్న బాలుడు

అశ్వాపురం: మండలంలోని అమెర్దకాలనీ గ్రామంలో ఇరుగు నాగరాజు కుమారుడు విగ్నేశ్(7) సోమవారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఇంటి డాబాపై ఆడుకుంటుండగా 33/11 కేవీ విద్యుత్ తీగలు తగిలి బాలుడు షాక్‌కు గురయ్యాడు. తల్లిదండ్రులు హుటాహుటిన భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

ఎదురుకాల్పుల్లో జవాన్ మృతి


ఎదురుకాల్పుల్లో గాయపడిన జవాన్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ – ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని కోమ్నా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సునా బేడ అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులు తారస పడటంతో ఇరువర్గాల మధ్య భారీ ఎత్తున ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఓ జవాన్ మృతిచెందగా.. ఒడిశా రాష్ట్రం సుప్పాడ జిల్లా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్‌నకు చెందిన జవాన్ ప్రకాష్‌సాయికి బుల్లెట్ గాయం కావడంతో జిల్లా వైద్యశాలకు తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రైతును దుర్భాషలాడిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ యాకూబ్ అలీ కథనం ప్రకారం.. మండలంలోని వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధి తిమ్మాపురం గ్రామ సమీపంలో ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెనికి చెందిన రైతు పాలూరి సత్యనారాయణకు మామిడి తోట ఉంది. ఈ నెల 18వ తేదీన సత్యనారాయణ వెళ్లగా, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలానికి చెందిన నూకవరపు సూర్యకుమారి, ఎన్.రమణ, విజయ్‌కాంత్, అప్పారావు తోటలోకి రాకుండా అడ్డుకోవడంతోపాటు దుర్భాషలాడి, బెదిరింపులకు పాల్పడినట్లు సోమవారం బాధిత రైతు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సూర్యకుమారి, రమణ, విజయ్‌కాంత్, అప్పారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,229

సాయం కోరి.. ఫోన్ మాయం చేస్తారు..

- బైక్ పైనుంచి పడిపోతున్నట్లు నటన
- సాయం చేసేందుకు వచ్చేవారి సెల్‌ఫోన్ల చోరీ
- ఆందోళన చెందుతున్న ప్రజలు



సెల్‌ఫోన్ చోరీ చేసి ఒకే బైక్‌పై వెళ్తున్న దుండగులు

సత్తుపల్లి: సెల్‌ఫోన్లు అపహరించేందుకు ఇద్దరు అగంతకులు కొత్త రకంగా ఆలోచించారు. ద్విచక్రవాహనం పైనుంచి పడిపోతున్నట్లు నటించి.. పట్టుకోండి.. పట్టుకోండి.. అని అరుస్తున్నారు. సాయం చేద్దామని వెళ్లేవారి జేబుల్లో నుంచి మరో వ్యక్తి వచ్చి సెల్‌ఫోన్ కొట్టేసి పారిపోవడం వారి ప్లాన్‌లో భాగంగా ఇలా పదుల సంఖ్యలో చోరీలకు పాల్పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎరుపు రంగు హోండా ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట నుంచి ఖమ్మం వరకు తిరుగుతూ సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఎంతో చాకచక్యంగా..

రెండు, మూడు నెలల నుంచి ఇద్దరు యువకులు ఈ తరహా దొంగతనాలకు పాల్పడటం చర్చనీయాంశమైంది. సెల్‌ఫోన్ అపహరించేందుకు టార్గెట్ ఫిక్స్ చేసుకొని ఓ అగంతకుడు ముందుగా కొద్ది దూరంలో నిల్చొని పరిసరాలను గమనిస్తూ ఉంటాడు. ఇంతలో మోటారు సైకిల్‌పై వచ్చిన యువకుడు కిందపడుతున్నట్లు నటిస్తుంటే ఆ సమయంలో సహాయం చేసేందుకు ఎవరైనా వ్యక్తి ముందుకు వస్తే అప్పటి వరకు దూరం నుంచి గమనిస్తున్న వ్యక్తి హడావుడిగా వచ్చినట్లు వచ్చి సహాయం చేయటానికి వచ్చిన వ్యక్తి జేబులో నుంచి సెల్‌ఫోన్ కొట్టేసి.. మోటారు సైకిల్‌ను పైకిలేపుతున్నట్టు నటిస్తూ.. కిందపడుతున్న వ్యక్తిని మోటారు సైకిల్‌పై ఎక్కించి ఇద్దరూ కలిసి పారిపోతారు. తర్వాత చూసుకుంటే సహాయం చేసిన వ్యక్తి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురై ఉంటుంది.


సత్తుపల్లిలో సీసీ కెమెరాకు చిక్కిన వ్యక్తులు

సీసీ కెమెరాలకు చిక్కినా..

ఎరుపురంగు మోటారు సైకిల్‌పై తిరుగుతూ సెల్‌ఫోన్ చోరీ చేస్తున్నట్లు పలుచోట్ల సీసీ కెమెరాలకు చిక్కినా ఆ ఇద్దరు అగంతకులు పోలీసులకు చిక్కకుండా సవాల్ విసురుతున్నారు. సోషల్ మీడియాలో సీసీ కెమెరాలో చిక్కిన ఆ అగంతకులను చూసి వీళ్లే దొంగలంటూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సత్తుపల్లిలో ఓసారి దొంగతనం చేస్తే తిరిగి నెల రోజుల వరకు అక్కడ చేయకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో దొంగతనాలు చేసినా ఆ దుండగులు ఎక్కడా చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ ఇద్దరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సెల్‌ఫోన్ దొంగల ఆట కట్టిస్తామని సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపారు.

రైతు బాంధవుడు 'రాయల'


శేషగిరిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

తల్లాడ: రైతాంగం సమస్యల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన నాయకుడు రాయల వెంకటశేషగిరిరావు అని, ఆయన ఆశయ సాధన కోసం బీఆర్‌ఎస్ కృషి చేస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాయల శేషగిరిరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భార్య పద్మావతి, కుమారులను ఓదార్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శేషగిరిరావు తొలి ఎంపీపీగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పని చేసి ప్రజల మన్ననలను చూరగొన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్‌కుమార్, రేగా కాంతారావు, రాకేశ్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దిరిశాల ప్రమీల, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల దాసురావు, డి.వెంకట్‌లాల్, నాయుడు శ్రీనివాసరావు, కేతినేని చలపతిరావు, మువ్వా మురళి, అయిలూరి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

లోడింగ్ పెంచే వరకు లారీలు కదలవు


సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

సత్తుపల్లి: సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఇచ్చి.. లోడింగ్ పెంచే వరకు లారీలు ఇక్కడి నుంచి కదలవని లారీ యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, ఎస్‌కే కీజర్ స్పష్టంచేశారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో సోమవారం లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించినా స్థానిక లారీలకు లోడింగ్‌లు పెంచటం విషయమై సింగరేణి అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. 40 శాతం లోడింగ్ ఇచ్చే వరకు ఆందోళనలు కొనసాగిద్దామని తీర్మానించారు. సత్తుపల్లి కాంగ్రెస్ నేత ఉడతనేని అప్పారావు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌కే లియాఖత్, కోటిరెడ్డి, ఎస్‌కే మునీర్ పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో బృందం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును కలిసేందుకు హైదరాబాద్ వెళ్లింది.

కేరళ సహకార రంగంపై అధ్యయనం

23 వరకు డీసీసీబీ పాలకవర్గం స్టడీ టూర్


కేరళలోని సహకార బ్యాంకులో అధ్యయనం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం కేరళ సహకార రంగంపై అధ్యయనం చేసేందుకు ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు విజ్ఞానయాత్ర సాగిస్తోంది. కేరళ బ్యాంకులకు అనుబంధంగా ఉన్న మున్నారు కో–ఆపరేటివ్ బ్యాంకును బృందం సందర్శించింది. హెచ్‌ఆర్ పాలసీలు, వివిధ రకాల రుణ పథకాలు, డిపాజిట్ స్కీంలు, వడ్డీరేట్లు, ఇతర సేవా కార్యక్రమాలు, రైతులకు మేలు జరిగే అంశాలను అధ్యయనం చేసింది. కేరళ రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న రెండంచెల సహకార వ్యవస్థపై కూడా బృందం అధ్యయనం చేస్తోంది. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. కేరళలో అమలు జరుగుతున్న సహకార విధానాలు రైతులకు ప్రయోజనం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. నాబార్డ్ సహకారంతో టెస్కాబ్, సీటీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్రలో డీసీసీబీ ప్రతినిధులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, కృష్ణయ్య, చావా వేణు, మేకల మల్లిబాబు యాదవ్, నిర్మల పుల్లారావు, బోబోలు లక్ష్మణ్‌రావు, జనగం కోటేశ్వరరావు, పేరబత్తిని ప్రసాద్, నూకల సైదులు, మోదుగు పల్లారావు, డీజీఎం కిరణ్, ఏజీఎం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పిడుగుపడి భారీగా ఆస్తినష్టం


పిడుగుపాటుకు దగ్ధమైన సామగ్రి

సుజాతనగర్: మండలంలోని ఉప్పరిగూడెం గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు భారీగా ఆస్తినష్టం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తండ్రీకొడుకులైన మాలోత్ లక్ష్మణ్, శ్రీను కుటుంబాలు పూరింట్లో నివాసం ఉంటున్నాయి. సాయంత్రం ఉరుములు, మెరుపులు రాగా ఇంటిపై పిడుగుపడింది. దీంతో 8 క్వింటాళ్ల బియ్యం, విద్యుత్ మీటర్లు, ఫ్రిజ్, కూలర్, మంచాలు, పరుపులు, వంట సామగ్రి, ఇంటితో పాటు, రూ.1.50 లక్షల నగదు కాలిపోయింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తోలెం బాబు పంచనామా నిర్వహించారు. సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆర్‌ఐ తెలిపారు.

మావోయిస్టు కమిటీ సభ్యుల లొంగుబాటు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు ఏరియా కమిటీ, గ్రామ కమిటీ ఇన్‌చార్జ్‌లు కోవాసి గంగా, సోడి ఉంగి, కలుసు బుద్రాలు సోమవారం లొంగిపోయారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. మావోయిస్టు పార్టీకి చెందిన నిమ్మలగూడ కిష్టారం పీఎస్ పరిధి ఏటూరునాగారం మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ సభ్యుడు కొవ్వాసి గంగా అలియాస్ మహేశ్, నిమ్మలగూడకిష్టారం పీఎస్‌కు చెందిన సోడి ఉంగి అలియాస్ ఝాన్సీ ఏరియా కమిటీ సభ్యుడితో పాటు గ్రామ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా కృష్టారం గ్రామానికి చెందిన పుట్టపాడు ఇన్‌చార్జ్ (డీఏకేఎంఎస్) కలుసు బుద్ర లొంగిపోయిన వారిలో ఉన్నారని తెలిపారు. కొవ్వాసి గంగా 2009లో ఏటూరునాగారం – మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ మిలీషియా సభ్యుడిగా చేరి, 2015లో ఏసీఎంగా పదోన్నతిని పొందాడని తెలిపారు. సోడి ఉంగి 2019లో మావోయిస్టు పార్టీలో చేరి ఏటూరునాగారం – మహదేవ్‌పూర్ ఏరియా దళ సభ్యురాలిగా పనిచేస్తూ గంగాను వివాహం చేసుకుందని చెప్పారు. ప్రస్తుతం భర్తతో కలిసి లొంగిపోయారని వెల్లడించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అడిషనల్ కమాండర్ కమల్‌వీర్ యాదవ్, 81 బెటాలియన్ అడిషనల్ కమాండర్ కన్వార్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్‌ఐ టీవీఆర్ సూరి పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి..


కాలినడకన తిరుపతికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: గతేడాది అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రివర్గంలో మల్లు భట్టి విక్రమార్క ఉండాలని కోరుకున్న మండల కాంగ్రెస్ నాయకులు.. తమ కోరిక నెరవేరితే కాలినడకన తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకుంటామని శ్రీ వేంకటేశ్వరుడిని వేడుకున్నారు. తమ కోరిక తీరడంతో పార్టీ నేతలు తల్లపురెడ్డి నాగిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి సోమవారం జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం నుంచి కాలినడకన తిరుమల బయలుదేరారు. తొలుత జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి తోడుగా కర్నాటి అంజిరెడ్డి, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి కూడా కాలినడకన వెళ్లారు. తొలిరోజు 28 కి.మీ. నడిచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చేరుకున్నారు. వీరి పాదయాత్రకు పలువురు సంఘీభావం తెలిపారు.


ఆరుగురిపై చీటింగ్ కేసు

ఖమ్మంక్రైం: నకిలీ ధ్రువపత్రాలతో పలువురి ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న టీఎన్జీవోస్ అధ్యక్షుడు, మరో ఐదుగురిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. విజయనగర్‌కాలనీలో ఉన్న బాణాల శ్రీదేవితోపాటు మరికొంతమందికి చెందిన ప్లాట్లను నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం బయట పడటంతో బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మోయిజ్‌అలీ సాయం చేయగా అఫ్జల్ హసన్ తోపాటు షేక్ మైబూ, నౌషద్‌ఖాన్, షేక్ సాహిబాసుల్తానా, రావులపల్లి రవిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. వీరు పరారీలో ఉన్నారని సీఐ వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు సోమవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. మామిళ్లగూడెంలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి రూ.లక్షకు పైగా నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నవారిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని సీఐ వివరించారు.

తల్లి, పిల్లలను చంపిన వ్యక్తి అరెస్ట్


నిందితుడు వెంకటేశ్వర్లు

తల్లాడ: రెండో భార్య మోజులో పడి.. కనిపెంచిన తల్లి, రక్తం పంచుకొని పుట్టిన ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన నిందితుడు పిట్టల వెంకటేశ్వర్లును వైరా సీఐ సాగర్ అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గోపాలపేట గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తల్లాడకు చెందిన గూడె త్రివేణితో వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు. భార్య కనకదుర్గ కొంతకాలం కిందట మృతిచెందగా ఇద్దరు ఆడపిల్లలు ఉండటంతో వెంకటేశ్వర్లుపై అనుమానం ఉన్నప్పటికీ వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిలో అరఎకరం తల్లిపేరుపై, అర ఎకరం పిల్లల పేరుపై పెద్దమనుషులు రాయించారు. నాలుగు నెలల తర్వాత త్రివేణిని వివాహం ఖమ్మం వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందులతో త్రివేణికి, వెంకటేశ్వర్లుకు మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. తల్లి, పిల్లలను చంపితే ఆస్తి వస్తుందని భావించిన వెంకటేశ్వర్లు ఈ నెల 17న అర్ధరాత్రి ఖమ్మం నుంచి గోపాల పేట వచ్చి తల్లి పిచ్చమ్మ, కుమార్తెలు నీరజ, ఝాన్సీల ముఖాలపై దిండు అదిమి, గొంతు నులిమి హత్యచేశాడు. తిరిగి బస్సులో ఖమ్మం వెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి వైరా సీఐ సాగర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి రెండో భార్య త్రివేణితో కలిసి అత్తగారి ఊరైన సత్తుపల్లి వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సాగర్ ఆధ్వర్యంలో వారిని రిమాండ్‌కు తరలించారు.

వాగులోకి దూసుకెళ్లిన కారు

క్షేమంగా బయటపడిన ఇద్దరు వ్యక్తులు


వాగులోలోకి దూసుకెళ్లిన కారు

చర్ల: మండలంలోని కుదునూరు సమీపంలో సుమారు ఇరవై అడుగుల లోతు ఉన్న జోడిచీలికలవాగులోకి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు క్షేమంగా బయటపడిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వరంగల్ నుంచి ఇల్లెందు మీదుగా వస్తున్న ఓ కారు చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెంనకు వచ్చే క్రమంలో కుదునూరు – దేవరాపల్లి గ్రామాల మధ్యలోని జోడిచీలికల వాగు వంతెన వద్ద అదుపుతప్పి హైలెవల్ వంతెనకు ఆనుకొని ఉన్న అప్రోచ్‌రోడ్డు పక్కన ఉన్న చెట్లను ఢీకొని వంతెన కిందకు దూసుకెళ్లింది. కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతినగా క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

పిడుగుపాటుతో పశువులు మృతి

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి, రావికంపాడు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడటంతో రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. పెద్దకోరుకొండికి చెందిన వినుకొండ దానియేలు ఇటీవల రూ.80 వేలతో ఎద్దును కొనుగోలు చేయగా.. అది మేత కోసం చేలలోకి వెళ్లింది. ఆదివారం సాయంత్రానికి ఇంటికి రావాల్సిన ఎద్దు సోమవారం ఉదయం వరకు కూడా రాలేదు. దీంతో చేలల్లో పరిశీలించగా వెన్నవల్లి రోడ్డు పక్కన గల ఒక మామిడితోటలో ఎద్దు మృతిచెంది ఉంది. రావికంపాడు గ్రామానికి చెందిన వలేబోయిన సత్యనారాయణకు చెందిన ఆవు కూడా పిడుగుపాటుతో మృత్యువాతకు గురైంది. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని అంచనా. పిడుగుపాటుకు పశువులు చనిపోయాయని వెటర్నరీ శాఖకు సోమవారం ఫిర్యాదు చేయగా పశు వైద్యులు వెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు. బోడిమెల్ల వద్ద చంద్రుపట్ల గ్రామానికి చెందిన నెల్లూరు పుల్లయ్యకు చెందిన బావి వద్ద సోమవారం ఉదయం గేదె చనిపోయిన విషయాన్ని పరిసర ప్రాంతాల రైతులు గుర్తించి సమాచారం అందించారు. ఈ గేదె కూడా పిడుగుపాటు వల్ల చనిపోయిందని భావిస్తున్నారు.


విద్యుదాఘాతంతో గేదెలు..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకానగర్‌కు చెందిన రాచబంటి పద్మకు చెందిన పాడి గేదెలను మేత కోసం రిజర్వాయర్ ప్రాంతానికి వదిలారు. రిజర్వాయర్ ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం వద్ద ఎర్త్ వైరు తగిలి రెండు పాడి గేదెలు సోమవారం మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలో సోమవారం పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కూనవరం చెక్‌పోస్టు వద్ద టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీనిని సీలేరులో కొనుగోలు చేసి విజయవాడకు తరలిస్తున్నట్లు తేలింది. బైక్‌పై ఉన్న ముగ్గురిలో విజయవాడ (గొల్లపూడి)కు చెందిన గౌతమ్‌దేవ్ పట్టుబడగా ఇద్దరు పరారయ్యారు. గంజాయి 2.6 కేజీలు ఉండగా రూ.66 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సంజీవరావు తెలిపారు.

కలప పట్టివేత


ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను పట్టుకున్న అటవీ అధికారులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు బీట్ చీమలపాడు అటవీ ప్రాంతంలో అక్రమంగా కలప నరికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకొని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు కథనం మేరకు.. పడమటనర్సాపురం గ్రామానికి చెందిన మాలోత్ కిషన్ కాకర పాదుల సపోర్టు కోసం పాపకొల్లు బీట్ చీమలపాడు అటవీ ప్రాంతంలో సంపదను నరికి గుండ్లరేవుకు చెందిన బోడా శాంతి ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకొని ఆదివారం రాత్రి తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పాపకొల్లు అటవీ సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్స్ విజయలక్ష్మి, కిషన్, చింతా వెంకటేశ్వర్లు, ఫైర్ వాచర్స్ లాజర్, సాధిక్ దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకుని, కార్యాలయానికి తరలించారు. రూ.21 వేలు జరిమానా విధించి, కిషన్, ట్రాక్టర్ యజమాని శాంతిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు తెలిపారు.